జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 25 | జూన్ | 2026 | పేజీలు : 7



## ప్రజల భద్రతే లక్ష్యం

- నేరాల నివారణకు అవ గాహన పెంచాలి: ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్
- ములకలపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



**ములకలపల్లి,జూన్ 24, (ప్రజాజ్యోతి):** ప్రజలు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ సూచించారు. బుధవారం ఆయన ములకలపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి పలు దిశానిర్దేశాలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వివిధ సమస్యలతో

మిగతా 2 లో...

- ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలకు తూట్లు...
- లోన్ల పేరుతో అక్రమ వసూళ్లు..
- పార్టిషన్ డీడ్‌లతో రుణాలు...
- అధిక వడ్డీలతో రుణగ్రహీతల ఆవేదన...




7 లో...

## పాల్వంచలో ... లోన్ మాఫియా

ఏజెన్సీ గ్రామ పంచాయతీ ప్రాంతాల్లో కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, మధ్యవర్తులు (దళారులు) మరియు రికవరీ ఏజెంట్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. "లోన్ ఇప్పిస్తాం" అనే పేరుతో అమాయక ప్రజల నుంచి భారీ మొత్తాల్లో అక్రమ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● పాల్వంచ, ప్రజాజ్యోతి

## ఎస్ఐఆర్ ప్రక్రియ విజయానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 24,(ప్రజాజ్యోతి)** జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లినప్పుడు అనుసరించాల్సిన విధానాలు, ఫారాల సమర్పణ ప్రక్రియ, ఆన్‌లైన్ , ఆఫ్‌లైన్ విధానాలు, ఆన్‌లైన్‌లో ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ దశలు, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ఆఫ్‌లైన్ ఫారాల పూర్తి విధానం తదితర అంశాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ

మిగతా 2 లో...

## గుణాత్మక విద్యకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి



**పాల్వంచ, జూలై 24, ప్రజాజ్యోతి:** విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి సూచించారు. బుధవారం పాల్వంచ కేటీపీఎస్ ఏ కాలనీలోని పీఎం శ్రీ (జడ్పహెచ్‌ఎస్) బాలికల ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్), ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల హాజరు నమోదును పరిశీలించారు. పాఠశాలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కావాలని, సమయపాలన

మిగతా 2 లో...

## గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో అకస్మాత్తుగా తనిఖీలు చేసిన కలెక్టర్ అంకిత్

- 24 గంటల్లో పూర్తి స్థాయిలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని హెచ్చరించిన :కలెక్టర్ అంకిత్
- ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి – జిల్లా కలెక్టర్ అంకిత్



**అశ్వాపురం, జూన్ 24, ప్రజాజ్యోతి:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృతంగా పర్యటించి పాఠశాలలు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా అశ్వాపురం మండలం గొందిగూడెం గిరిజన ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాలను

మిగతా 2 లో...

## ఎస్ఐఆర్ ప్రక్రియ విజయానికి రాజకీయ పార్టీలు సహకరించాలి



(మొదటి పేజీ తరువాయి...)

ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. ఇప్పటికే బీఎల్ వోలు, బీఎల్ఏలు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి సన్నాహక శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 24 నుండి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తప్పు సమాచారం సమర్పించిన సందర్భాల్లో వెంటనే తొలగింపు చేయకుండా, ముసాయిదా జాబితా అనంతరం నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని అర్హులైన కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు ఫారం–8 ద్వారా వివరాల సవరణ చేసుకోవచ్చని అన్నారు . ప్రతిరోజు బీఎల్వోలు గరిష్ఠంగా 50 ఫారాల వరకు సమర్పించే అవకాశం ఉందని తెలిపారు. బీఎల్వోలు, బీఎల్ఏలు సమన్వయంతో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని చెప్పారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసే యువత కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. అనంతరం రాజకీయ నాయకులు పార్టీ ప్రతినిధులకు తలెత్తిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ సూపరిండెంట్ రంగ ప్రసాద్, టిఆర్ఎస్ పార్టీ వెంకటేశ్వర నాయక్, అన్వర్, కాంగ్రెస్ పార్టీ నుండి లక్ష్మణ్ అగర్వాల్, సిపిఐ పార్టీ నుండి అన్నవరపు సత్యనారాయణ, బిజెపి పార్టీ నుండి రవి నాయక్, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గుణాత్మక విద్యకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

పాటించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ వివరాలను తెలంగాణ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, డ్రాప్అవుట్‌ల సంఖ్య పెరగకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యార్థులలో కనీస అభ్యాస సామర్థ్యాల పెంపుదలకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా వ్యవహరించాలని ఆమె అన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థాయిని, బోధన విధానాలను పరిశీలించారు. ఈ తనిఖీలో మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీరామ్ మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో అకస్మాత్తుగా తనిఖీలు చేసిన కలెక్టర్ అంకిత్









(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, పాఠశాల ఆవరణను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్లు దుమ్ము, ధూళితో అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం పాఠశాల సందర్శన సందర్భంగా ఇదే అంశంపై సూచనలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సక్రమంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయమై సంబంధిత సీటీవోతో ఫోన్‌లో మాట్లాడి కంప్యూటర్ ఇన్‌స్పెక్టర్ కాంట్రాక్టును రద్దు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుని గది, వంటశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించటానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదని గుర్తించి హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరారు. విద్యార్థుల సంఖ్య ఎంత ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాలను తనిఖీ చేసిన సందర్భంగా అక్కడ కూడా పరిశుభ్రత లోపాలను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుని గది మినహా పాఠశాలలోని మిగతా అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత లోపించిందని అసహనం వ్యక్తం చేశారు . పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల తదితర ప్రాంతాల్లో 24 గంటల్లో పూర్తి స్థాయిలో పరిశుభ్రత చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత లోపాలు, మెనూ అమలులో నిర్లక్ష్యంపై హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేయాలని ఆదేశించారు. కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యత, మెనూ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకుని, హాజరు నమోదును యాప్ ద్వారా పరిశీలించారు. విద్యార్థుల హాజరును ప్రతిరోజూ సక్రమంగా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు . అనంతరం అశ్వాపురం మండలం ఎలకలగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చేపడుతున్న సర్వే విధానం, దరఖాస్తుల పరిశీలన, యాప్ ద్వారా వివరాల నమోదు తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వివరాలను నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి సర్వే నిర్వహించాలని, అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా సర్వేకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యాప్‌లో నమోదు చేసే వివరాలు ఖచ్చితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నమోదైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ధృవీకరించాలని సూచించారు. సర్వే పురోగతిని ఎంపీడీవో జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అశ్వాపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మొత్తం 3,448 దరఖాస్తులు ఎల్–1 స్థాయిలో ఉన్నాయని, వాటిలో 2,075 దరఖాస్తుల సర్వే పూర్తయిందని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 409 గుడిసెలను గుర్తించినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అశ్వాపురం ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి...)

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకుని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్టికల్స్ వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును సమీక్షించిన ఆయన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతను చైతన్యవంతం చేయాలని సూచించారు. గంజాయి హాట్‌స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు అక్రమ రవాణా, వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్–100కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ రోహిత్ రాజుతో పాటు అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సై మధు ప్రసాద్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఇల్లందు దాటరు...
# కుర్చీ వదలరు!

**సింగరేణిలో లాంగ్ స్టాండింగ్ ఉద్యోగులపై చర్చ**

- **ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న వైనం**
- **బదిలీ నిబంధనలు వీరికి వర్తించవా అని ప్రశ్నలు**
- **కొత్త వారికి అవకాశాలు దూరమవుతున్నాయనే విమర్శలు**
- **పరిపాలనా పారదర్శకతపై కార్మికుల్లో అనుమానాలు**
- **ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్**




**ఇల్లందు, జూన్ 24 (ప్రజా జ్యోతి)** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో ఒకే ప్రాంతంలో లేదా ఒకే విభాగంలో ఎక్కువకాలం పనిచేసే అధికారులు, ఉద్యోగులు నిర్దిష్ట వ్యవధి అనంతరం బదిలీ చేయడం సాధారణమే. అయితే ఇల్లందు ప్రాంతంలోని కొన్ని విభాగాల్లో మాత్రం కొందరు ఉద్యోగులు, అధికారులు ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారనే చర్చ కార్మిక వర్గాల్లో జోరుగా సాగుతుంది. లాంగ్ స్టాండింగ్‌కు సంబంధించిన నిబంధనలు ఉన్నప్పటికీ అవి అందరికీ సమానంగా అమలు కావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంస్థలో కొత్తగా వచ్చిన ఉద్యోగులు తరచూ బదిలీలు ఎదుర్కొంటుండగా, కొందరు మాత్రం దశాబ్దాలుగా అదే స్థానాల్లో కొనసాగుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతుందని తెలుస్తుంది.

### ››› లాంగ్ స్టాండింగ్ నిబంధనలు కాగితాలకే పరిమితమా?

సాధారణంగా ఒకే విభాగంలో లేదా ఒకే ప్రాంతంలో ఎక్కువకాలం విధులు నిర్వహించే ఉద్యోగులను బదిలీ చేయడం ద్వారా పరిపాలనా సమతుల్యతను కాపాడుతారు. కానీ కొందరి విషయంలో మాత్రం ఈ నిబంధనలు అమలు కావడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఒకే చోట కొనసాగడం వల్ల వ్యక్తిగత ప్రభావాలు పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› కొందరికి ప్రత్యేక మినహాయింపులా?

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ ఒకే విధమైన నిబంధనలు ఉండాల్సి ఉన్నప్పటికీ, కొందరికి మాత్రం ప్రత్యేక వెసులుబాట్లు కల్పిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ కారణాలతో వీరు బదిలీలకు దూరంగా ఉంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరిపాలనా అవసరాలా? లేక మరేదైనా కారణాలా? అనే సందేహాలు ఉద్యోగుల్లో నెలకొన్నాయి.

### ››› కొత్త ఉద్యోగులకు నష్టమా?

ఒకే స్థానాల్లో కొందరు దీర్ఘకాలంగా కొనసాగడం వల్ల కొత్త ఉద్యోగులకు అవకాశాలు తగ్గుతున్నాయని కొందరు కార్మికులు పేర్కొంటున్నారు. వివిధ విభాగాల్లో అనుభవం పొందే అవకాశం లేకపోవడం వల్ల అధికారులు, ఉద్యోగుల వృత్తి అభివృద్ధి కూడా దెబ్బ తింటుందని అంటున్నారు.

### ››› కార్మికుల్లో పెరుగుతున్న అసంతృప్తి

బదిలీల విషయంలో సమానత్వం పాటించకపోతే ఉద్యోగుల్లో అసంతృప్తి పెరగడం సహజమని కార్మికులు పేర్కొంటున్నారు. ఒకరికి ఒక నిబంధన, మరొకరికి మరో నిబంధన అన్నట్టుగా వ్యవహరిస్తే సంస్థపై విశ్వాసం తగ్గే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### ››› అధికారుల నిశ్శబ్దం ఎందుకు?

లాంగ్ స్టాండింగ్ అంశంపై కార్మికులు పలుమార్లు ప్రస్తావించినప్పటికీ సంబంధిత అధికారులు పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ అంశంపై సమగ్ర సమీక్ష నిర్వహించి వాస్తవ పరిస్థితులను బయటపెట్టాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు కోరుతున్నారు.

### ››› పారదర్శకత కోసం చర్యలు అవసరమే?

సింగరేణి యాజమాన్యం లాంగ్ స్టాండింగ్ ఉద్యోగుల జాబితాను పరిశీలించి, నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సంస్థలో సమానత్వం, పారదర్శకత, పరిపాలనా సామర్థ్యం పెరగాలంటే ఈ అంశంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు లాంగ్ స్టాండింగ్ లో ఒకే విభాగంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న అధికారులు, కార్మికుల వివరాలు సేకరించి వారు స్థానంలో మరొకరికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్మికులు కోరుతున్నారు.

## ఎస్ఐఆర్ అవగాహన సదస్సు

- **45 పోలింగ్ బూత్‌లకు బీఎల్ఏల నియామకం తప్పనిసరి: తహసిల్దార్ వీరభద్రం**

**టేకులపల్లి,జూన్ 24,ప్రజాజ్యోతి:** మండలంలో జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టేకులపల్లి తహసిల్దార్ వీరభద్రం పిలుపునిచ్చారు.బుధ వారం తహసిల్దార్ కార్యాలయం లో వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు,బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు)పాల్గొన్న అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్య త,ఎన్నికల సంఘం నిబంధనలను వివరిస్తూ మండలంలోని 45 పోలింగ్ బూత్‌లకు ప్రతి రాజకీయ పార్టీ తప్పనిసరిగా ఒక్కో బీఎల్ఏ ను నియమించాలని సూచించారు. నియమించబడే బీఎల్ఏలు ఆయా పోలింగ్ కేంద్ర పరిధిలోని ఓటర్లె ఉండాలని,ప్రభుత్వ ఉద్యోగులు బీఎల్ఏలుగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరు పేరుతో ముద్రించిన రెండు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు వాటిని పూర్తిగా నింపి ఒక ఫారాన్ని తమ వద్ద ఉంచుకుని, మరొకదాన్ని బీఎల్ఓలకు అందించాలని సూచించారు. సర్వే సమయంలో ఇళ్లకు తాళం వేసి ఉంటే, బీఎల్ఓలు కనీసం మూడు సార్లు సందర్శించిన తర్వాతే నివేదిక సమర్పించాలని ఎన్నికల సంఘం నిబంధనలు పేర్కొంటున్నాయని వివరించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం,లోపాలు లేని పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించడమే ఎస్ఐఆర్ కార్యక్ర మం ప్రధాన లక్ష్యమని తహసిల్దార్ పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు అత్యం త విలువైన హక్కు అని, దాని పరిరక్షణలో రాజకీయ పార్టీలు, ఓటర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని కోరారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి



**ఇల్లందు, జూన్ 24 (ప్రజా జ్యోతి)** డ్రగ్ రహిత సమాజం కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు స్పష్టం చేశారు. బుధవారం ఇల్లందు పట్టణంలోని పలు దుకాణాలలో నార్కోటిక్ డాగ్ తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ మహమ్మారి ప్రధానంగా యువత జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. ఒకసారి డ్రగ్స్ కు బానిసైన వారు అందులోనుండి బయటకు రావడం కష్టంగా ఉంటుందని, ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందని తెలిపారు. డ్రగ్స్ సేవించిన, రవాణా చేసిన, విక్రయాలు జరిపిన చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. రక్షకు బానిసై బంగారు జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ సేవించడం, రవాణా జరుగుతున్నట్లు, విక్రయాలు కొనసాగిస్తున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్, పోలీసులు, నార్కోటిక్ బృందం పాల్గొన్నారు.

## వన్య ప్రాణులను రక్షించాలి



**ఇల్లందు, జూన్ 24 (ప్రజా జ్యోతి)** వన్యప్రాణులను ప్రతి ఒక్కరూ రక్షించాలని ఇల్లందు ఎంఈఓ ఉమాశంకర్ కోరారు. బుధవారం మండల పరిధిలోని యంపిపిఎస్ సుభాష్ నగర్ కు ఒక నెమలిని కుక్కలు వెంబడించడంతో పాఠశాల ఆవరణలోకి రావడం వచ్చింది. దింతో స్కావెంజర్, విద్యార్థులు కలిసి నెమలిని పట్టుకొని వంట గదిలో సురక్షితంగా ఉంచారు. విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకురావడంతో ఎంఈఓ వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఎఫ్ఎస్ఓ గుగులోత్ తారా సింగ్, బీట్ ఆఫీసర్ బాలకృష్ణ లకు అప్పగించారు. సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు వన్య ప్రాణులు ఎంతో కీలకమని, వాటిని సంరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్రమాదంలో ఉన్న జాతీయ పక్షిని కాపాడిన సిబ్బంది, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు జాన్ దేవదత్తం, పాఠశాల ఉపాధ్యాయులు ఆంగోత్ రమేష్, స్వరూప, కృష్ణవేణి, సుశీల, సీఆర్పి శేఖర్, సుమలత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైటీపీఎస్లోని ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ విభాగాల ప్రయివేటీకరణ నిరసిస్తూ ఆందోళన




**భద్రాచలం టౌన్ , జూన్ 24 , ప్రజాజ్యోతి,** టీజీపీఈజేఏసీ కొత్తగూడెం బ్రాంచి ఆద్వర్యంలోని వైటీపీఎస్లో గల ఎహెచ్‌పీ, సీహెచ్‌పీ విభాగాల ప్రయివేటీకరణను నిరసిస్తూ భద్రాచలంలో బుధవారం విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఉద్యోగులందరూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ వైటీపీఎస్లో గల ఎహెచ్‌పీ, సీహెచ్‌పీ విభాగాల ప్రయివేటీకరణ వలన ఉద్యోగుల భద్రత, సేవా ప్రమాణాలు,సంస్థ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఉద్యోగులలో ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. జెన్కోను రక్షిస్తూ, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడతామని వారు స్పష్టం చేశారు. సేవ్ వైటీపీఎస్, సేవ్ టీజీ జెన్కో అనే నినాదాలతో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ జీవన్ కుమార్, ఏడిఈలు నరసింహారావు, వేణు, ఏఈలు రాజారావు ,ఉపేందర్,,రోహిణి, జ్యోతి, సబ్ ఇంజనీర్లు, భద్రాచలం ఈఆర్వో స్టాప్, భద్రాచలం డివిజన్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు వెంకటరాజు, రామకృష్ణ, ఉదయ్, పెద్దరాజు, త్రినాధ్ రెడ్డి,అన్నీ సెక్షన్ల ఏఈలు, సబ్ ఇంజనీర్స్,వర్క్ ఇన్స్పెక్టర్లు, సీనియర్ లైన్మెన్లు, లైనింగ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# "అమ్మ మాట – అంగన్‌వాడీ బాట" కార్యక్రమం

- చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీలే పునాది : సర్పంచ్ కుంజా వినోద్





**జగన్నాథపురం, జూన్ 24 (ప్రజాజ్యోతి):** చిన్నారుల విద్యాభివృద్ధికి అంగన్ వాడీ కేంద్రాలే పునాది అని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన "అమ్మ మాట – అంగన్‌వా డీ బాట" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా చేరిన చిన్నారులకు ఆయన చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించి, ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. గ్రామపంచాయతీ పరిధిలోని 10 అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్నారుల విద్య, ఆరోగ్యం, సంక్షేమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి నూతనంగా నియమితులైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భవానిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జలగం మాధవి, వార్డు సభ్యులు వాడే నాగరాజు, సున్నం మంగ, జమిలి ప్రదీప్, పిడియాల వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ జానీ, కాంగ్రెస్ నాయకులు సున్నం నాగేష్, కూరం రామకృష్ణ, సోయం బోడప్ప, సురభి రాజేష్, రామాచారి, కార్యదర్శి సునీష్, నర్సాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ఇల్లందు, జూన్ 24 (ప్రజా జ్యోతి)** నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని సుదిమళ్ల రైతు వేదికలో విత్తన మేళా ను మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలు, అపరాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మండలంలోని అన్ని విత్తనాల డీలర్లు ఈ విత్తనం మేళాకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ విత్తన మేళా ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు ఒకే చోట సులభంగా లభిస్తాయన్నారు. నెల 30 వరకు మండలంలోని మూడు రైతు వేదికలలో విత్తన మేళా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, ఏడిఏ లాల్ చంద్, సర్పంచులు కుంజ సుకునయ్య, పాయం స్వాతి, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఏఓ సతీష్ కుమార్, ఏఈఓ వంశీ, పంచాయతీ కార్యదర్శి ఆజాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము, నాయకులు పులి సైదులు, తిరుపతి, తాటి భిక్షం, మోకాళ్ళ వెంకటమ్మ, శ్రీను, సతీష్, ప్రసన్న కుమార్ యాదవ్, వీరా, నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి





**ఇల్లందు, జూన్ 24 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ శ్రేణులు ప్రతి గ్రామంలోని ప్రజలకు తెలియజేయాలని మాజీ వైస్ ఎంపీపీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాము కోరారు. బుధవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు బొజ్జాయిగూడెం, పూబెల్లి గ్రామాలలో పర్యటించి నూతన గ్రామ కమిటీలను నియమించారు. మండల రాము మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ప్రతి గ్రామంలో మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ శ్రే ణులు నిరంతరం కృషి చేయాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ పాలనకు నిదర్శమన్నారు. రాష్ట్ర ప్రజల్లో ప్రభుత్వ పాలనకు వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేక లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి అం టేనే కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ముందుగా బొజ్జాయిగూడెం సమ్మక్క సారలమ్మల గద్దెల వద్ద పూజ నిర్వహించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పిఏసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, సర్పంచ్ పాయం స్వాతి, తాటి యశోద, మాజీ ఎంపీపీ మోకాళ్ళ వెంకటమ్మ, బొజ్జాయిగూడెం ఉపసర్పంచ్ అరేం కిరణ్, నాయకులు పులి సైదులు, సతీష్ నాయక్, తిరుపతి నాయక్, రాంబాబు, ప్రసన్న కుమార్ యాదవ్, వీరా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ.1.45 లక్షల చెక్కు అందజేత

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 24, (ప్రజా జ్యోతి )** మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి కోసం బిటీపీఎస్ సీఈ బిచ్చన్న ఆధ్వర్యంలోబుధవారం ఐ డి ఓ సి కార్యాలయం కలెక్టర్ ఛాంబర్ నందు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల కింద రూ.1.45 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్ కు బుధవారం అందజేశారు, కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఇలాంటి సిఎస్ఆర్ నిధులు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు . సమాజాభివృద్ధిలో భాగం గా మరిన్ని సంస్థలు కూడా విద్యా రంగ అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. అనంతరం సీఈ బిచ్చన్న మాట్లాడుతూ, మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. సిపిఓ సంజీవరావు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీసీ కార్మికులకు డ్రగ్స్ పై అవగాహన



**బూర్గంపహాడ్, జూన్ 24 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో డ్రగ్స్ పై బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడుతూ యువత, కార్మికులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉంటే కుటుంబాలు బాగుంటాయన్నారు. మత్తు పదార్ధాలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, అంతేకాకుండా యువకులపై కేసులు నమోదైతే జీవితాంతం జైలు పాలు కావాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్ధాలకు దూరంగా ఉండి మంచి నడవడికతో ముందుకు సాగాలని పలు సూచనలు చేశారు. గంజాయి సేవించినా, విక్రయించినా అలాంటి వారి సమాచారం పోలీసు స్టేషన్కు లేదా 100కు డయల్ చేసి తెలియచేయాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై నాగభిక్షం, ఎస్సై రామ్మూర్తి, పోలీసు సిబ్బంది, ఐటీసీ కార్మికులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ విజయవంతానికి బిఎల్ఎ ఐక్యంగా కృషి చేయాలి

- భద్రాచలం తహసీల్దారు కోట రవికుమార్




**భద్రాచలం టౌన్ , జూన్ 24 ప్రజాజ్యోతి** ఓటర్ల జాబితా నవీకరణ ప్రక్రియలో భాగంగా నేటి నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కార్యక్రమంను విజయవంతం చేసేందుకు బిఎల్ఎలు ఐక్యంగా కృషి చేయాలని భద్రాచలం తహసీల్దారు కోటా రవికుమార్ అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమన్వయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియ మొత్తానికి బూత్ లెవెల్ అధికారులు, బూతు లెవెల్ ఏజెంట్లు రెండు కళ్ళు వంటి వారని, ప్రతి ఇంటికి బిఎల్వోలు ఎలిమినేషన్ ఫారాలు అందిస్తారని ప్రతి ఓటర్కి ఫారాలు అందే విధంగా బి ఎల్ ఏ లు దృష్టి సారించాలని కోరారు. ఈ ప్రక్రియ జులై 24 వరకు కొనసాగుతుందన్నారు. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, అనంతరం ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు ఆగస్టు 30 వరకు స్వీకరించబడతాయన్నారు. సెప్టెంబర్ ఒకటో తారీఖున తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని వివరించారు. 90 రోజులపాటు జరగనున్న సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు ప్రతిపాదించిన బూతులు ఏజెంట్లు ప్రభుత్వం ప్రకటించిన బూతు లెవల్ అధికారులే అత్యంత కీలకంగా పని చేయాల్సి ఉంటుందని తాసిల్దార్ కోరారు. ఈ సమన్వయ సమావేశంలో రాజకీయ పార్టీల ఏజెంట్లు బూతు లెవల్ అధికారులు పాల్గొని వారికున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటి ఎలక్షన్ గోపాలకృష్ణ సీనియర్ నాయకులు రామయ్య బి ఎల్ ఓ సూపర్వైజర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్ , జూన్ 24 ప్రజా జ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి బుధవారం అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. అనంతరం కల్యాణం లో పాల్గొన్న వారికి స్వామి వారి దర్శనంతోపాటు అన్నప్రసాద సౌకర్యం కల్పించారు.

# జర్నలిస్ట్ అపర్ణ మృతి కలచివేత

- ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన
- ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా





**సుజాతనగర్, జూన్ 24 ( ప్రజాజ్యోతి )** జర్నలిస్ట్‌గా పనిచేసే చంద్రగిరి అపర్ణ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. బుధవారం సుజాతనగర్ మండల కేంద్రంలోని ఐలయ్య కాలనీలో అపర్ణ భౌతికకాయాన్ని సందర్శించిన ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జర్నలిజం రంగంలో మంచి భవిష్యత్తు ఉన్న అపర్ణ అర్ధాంతరంగా మృతి చెందడం బాధాకరమన్నారు. ఆమె మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని పేర్కొన్నారు. అపర్ణకు తల్లితో పాటు ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారని వారి భవిష్యత్తు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇద్దరు చిన్నారుల విద్య, సంక్షేమ బాధ్యతలను ప్రభుత్వం తీసుకుని వారికి భరోసా కల్పించాలని కోరారు. అపర్ణ మృతికి సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి కుటుంబ సభ్యులు మరియు ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్ట్ కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమారి హన్మంతరావు, మాచర్ల శ్రీనివాస్, సపావట్ రవి, ఉపేందర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సౌకర్యాలతో మోడల్ మార్కెట్



**ఇల్లందు, జూన్ 24 (ప్రజా జ్యోతి)** రూ. 8 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో మోడల్ మార్కెట్ నిర్మించడం జరిగిందని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ అన్నారు. బుధవారం ఇల్లందు మోడల్ మార్కెట్ లో క్రయవిక్రయాలను చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య లు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సుమారు రూ. 8 కోట్ల నిధులు కేటాయించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. గత మార్కెట్ ఇరుకుగా ఉండడం వల్ల వ్యాపారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. నూతన మోడల్ మార్కెట్ లో అలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. నూతన మోడల్ మార్కెట్ ఏర్పాటు చేయడం పట్ల పేపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మున్సిపల్ కమిషనర్ ఎస్ సందీప్, వార్డు కౌన్సిలర్లు మహమ్మద్ జాఫర్, అజ్మీరా వంశీ, మెరుగు కార్తీక్ యాదవ్, చిల్లా విజయభారతి, సోని బాయి కోరి, పాబోలు స్వాతి మణికిరణ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమ్, నాయకులు దొడ్డ డానియల్, పెండేల హరికృష్ణ, రేఖ రవిశంకర్, చిల్లా శ్రీనివాస్, సుదర్శన్ కోరి, గందె సదానందం, కమల్ కుమార్ కోరి, మున్నా, గాలిపల్లి స్వరూప, కూరగాయల వ్యాపారులు గౌస్, జానీ, నారాయణ లోద్, ఖాదర్, రవి, విక్కీ, అనిత, వాజీద్, నగేష్‌గౌడ్, ఎల్లయ్య, మున్సిపల్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ప్రకాష్, గుడివాడ రాజేష్, నాయిని విక్రమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీలో భారీగా ఆటో డ్రైవర్ల చేరిక

- సూపర్ బజార్‌లో ఆటో అడ్డా జెండా ఆవిష్కరణ
- ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: కోనేరు చిన్ని



**కొత్తగూడెం, జూన్ 24 ( ప్రజాజ్యోతి )** కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్ ప్రాంతంలో ఆటో వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన ఆటో డ్రైవర్లు ఐఎన్‌టీయూసీలో చేరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కనకం సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కోనేరు చిన్ని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్ బజార్‌లో ఏర్పాటు చేసిన ఆటో అడ్డా జెండాను కోనేరు చిన్ని ఆవిష్కరించారు. అనంతరం యూనియన్‌లో చేరిన ఆటో డ్రైవర్లకు కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాట్లాడిన కోనేరు చిన్ని కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి అండగా ఉంటుందని తెలిపారు. కొత్తగూడెం ప్రాంతంలోని ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన డ్రైవర్లకు చేరేలా చర్యలు తీసుకుంటామని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలోనూ వారికి తగిన ప్రాధాన్యం కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కనకం సూరిబాబు మాట్లాడుతూ ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐఎన్‌ట ీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కొత్తగూడెం ప్రాంతంలో రాపిడో వ్యవస్థ రద్దు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా యూనియన్ అనేక ఉద్యమాలు నిర్వహించిందని గుర్తుచేశారు. ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా ముందుండి పోరాడతామని డ్రైవర్ల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావి రాంబాబు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లంగి శ్రీనివాస్, భాషా , కిషోర్, గంగులు, శోభన్, శివ, శ్రీను, సర్వయ్య, సురేష్, క్రిస్టఫర్, రమేష్, రంజిత్, చింటూ, ముంజి, కుమార్, రమేష్, వంశీ, అనిల్, జీడి శ్రీనివాస్, అల్లావుద్దీన్, గంగరాజు, ఇస్మాయిల్, వేణు, హథీరాం, శంకర్, రవి, రాజు, చిన్ను, నాగరాజు, లక్ష్మణ్, మోహన్, సతీష్, సంతోష్, రాకేష్, దుర్గ, మధు, వెంకన్న, అముల్‌రాజ్, ప్రసాద్, గణేష్, బాలు, జగదీష్, సాత్విక్, సాయి తదితరులు ఉన్నారు.

## యూరియా యాప్ రద్దు చేయాలి

- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, జూన్ 24: (ప్రజా జ్యోతి ):** రైతులకు ఇబ్బందులు కలిగించే యూరియా యాప్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. బుధవారం చర్లలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయం లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హా మీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయవద్దని చెబుతోందం టూ రైతుల్లో అనవసర ఆందోళన సృష్టిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా నిర్దిష్ట పంటలు సాగు చేసిన రైతులకే బోనస్ ప్రకటించడం వల్ల మిగతా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతు బంధు, రైతు బీమా అమలులోనూ జా ప్యం కారణంగా రైతులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. యూరియా పంపిణీ కోసం కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ గిరిజన, గ్రామీణ ప్రాంత రైతులకు మరింత భారంగా మారుతుందని తాతారావు అన్నారు. చాలామంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఉండడం వల్ల యాప్ ద్వారా యూరియా బుకింగ్ సాధ్యం కాదన్నారు. యాప్ వినియోగం పై అవగాహన లేని రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే ఎలాంటి షరతులు లేకుండా రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కో రారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అని ల్, తడికల బుల్లబ్బాయి, గోరెంట్ల వెంకటేశ్వరరావు, కారం కన్నారావు, ఆంబోజి సతీష్, గాదశెట్టి కిషోర్, కుక్కడపు సాయి సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు



**టేకులపల్లి, జూన్ 24, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం–ఇల్లందు ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయప డ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందు పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన అరవింద్, సందీప్ ఇద్దరూ బుధవారం ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం నుంచి ఇల్లందు వైపు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని రోళ్లపాడు సమీపానికి చేరుకోగానే వారి బైక్ అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో అరవింద్, సందీప్ ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు యువకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## గ్రామ పంచాయతి కార్మికుల సమస్యలపై సాచివేత ధోరణితో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం

- రెండున్నర సంవత్సరాలైనా రెండు రూపాయలు కూడా పెరగని వేతనాలు
- భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నాలో సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్



**భద్రాచలం టౌన్ , జూన్ 24 ప్రజాజ్యోతి** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 వేల మంది గ్రామ పంచాయతి కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సాచివేత ధోరణితో వ్యవహారిస్తుందని, అధికారం లోకి వచ్చి రెండున్నర సంవత్సరాలైనా రెండు రూపాయలు కూడా వేతనం పెరగలేదని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎ.జె రమేష్ విమర్శించారు. బుధవారం గ్రామ పంచాయతి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ముందు రాష్ట్ర కమిటి పిలుపు మేరకు భద్రాచలం లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరం వద్ద ఎ.జె.రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టో లో చెప్పిన విధంగా కార్మికులను పర్మినెంట్ చేయడం, జీతం రూ.18 వేలకు పెంచడం హామీలన్నీ గాల్లోకి కలిసిపోయాయని విమర్శించారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వడం లేదన్నారు. కొత్తగా ఆరు నెలల క్రితం గ్రామ పంచాయతీలలో పాలక వర్గాలు ఏర్పడిన నాటి నుంచి కొన్ని పంచాయతీలలో కాత్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతి కార్మికులను రెండవ పీఆర్సీ పరిధిలోకి తేవాలని, కనీస వేతనం పెరుగుతున్నా ధరలకనుగుణంగా రూ.26 వేల రూపాయలు పెంచాలని, ఇప్పటికైనా తన కార్మిక వ్యతిరేఖ పోకడలను, విధానాలను మార్చుకోవాలని లేని యెడల పోరాటలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట్రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో సీఐటీయు సీనియర్ నాయకులు ఎంబీ నర్సారెడ్డి, నాగరాజు, గ్రామ పంచాయతి యూనియన్ నాయకులు రామకృష్ణ, భవాని, నాగరాజు, నరసింహారావు, వెంకటేష్, నరేష్, సునీత పాల్గొన్నారు.

## ఆరిపా, రోషిని వృద్ధాశ్రమంలో యూడీసీ పద్మావతి జన్మదిన వేడుకలు



**అశ్వాపురం, జూన్ 24,ప్రజాజ్యోతి** అశ్వాపురం మండల కేంద్రంలోని ఎండిఓ ఆఫీస్ లో యూడీసీగా సేవలందించి ఇటీవల బదిలీపై బూర్గంపాడు మండలానికి వెళ్లిన పద్మావతి తన పుట్టినరోజు వేడుకలను గురువారం అశ్వాపురం మండల పరిది లోని మంచిగంటి నగర్ వృద్ధాశ్రమంలో ఘనంగా జన్మదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పత్రిక మిత్రులు, వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుడిసి పద్మావతి వృద్ధులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని సమాజంలో వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా నిజమైన ఆనందం లభిస్తుందని ఆమె తెలిపారు.వృద్ధాశ్రమ నిర్వాహకులు, పత్రిక మిత్రులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పద్మావతి సేవా భావాన్ని అభినందిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు శహనాజ్ బేగం, మెహెరాజ్, అమ్మగారిపల్లి సర్పంచ్ కవిత, పంచాయతీ కార్యదర్శి అజారుద్దీన్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎస్కే.ఖదీర్, అశ్వాపురం సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రెడ్డి మహేష్, నెహ్రూ, పగడాల రామిరెడ్డి, గద్దల ఏడుకొండలు, రావులపల్లి నరింహారావు, గంగరాజు, స్థానికులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- అధిక ఫీజులు, భద్రతా లోపాలపై డీఈవోకు బీజేపీ వినతి



**కొత్తగూడెం , జూన్ 24 ( ప్రజాజ్యోతి )**పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పలు పాఠశాలల్లో ఫిట్ నెస్ లేని బస్సులు నడుస్తున్నాయని, అవసరమైన అనుమతులు లేకుండానే రవాణా సేవలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అలాగే అనేక విద్యాసంస్థల్లో అగ్నిమాపక శాఖ అనుమతులు లేకపోవడం విద్యార్థులకు అవసరమైన ఆట స్థలాలు లేకపోయినా అనుమతులు పొందడం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కలంకార్ రాజశేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, అలివేలు, పట్టణ కార్యదర్శి సుహాసిని, మహిళా మోర్చా అధ్యక్షురాలు యామిని, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు భూక్యా పూర్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు హృదయ్, బీజేపీ జిల్లా నాయకులు నోముల రమేష్, ఆదిమూల రాములు, రాయుడు నాగేశ్వరరావు, రాజమౌళి, కార్యకర్తలు ఉమామహేశ్వర రావు, భాస్కర్ గౌడ్, జగదీష్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సహాయం కోరగానే స్పందన.. బాధితుడికి ఆర్థిక భరోసా

- సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.75 లక్షల ఎల్ఓసీ మంజూరుకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవ



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 24 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన పెంక మోహన్ అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులు అధికంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం కోసం అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను వాట్సాప్ ద్వారా సంప్రదించారు.విషయాన్ని వెంటనే గమనించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సంబంధిత అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా బాధితుడికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపట్టారు. ఆయన ప్రత్యేక చొరవతో రూ.2.75 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు కావడంతో చికిత్స ఖర్చులకు అవసరమైన ఆర్థిక భరోసా లభించింది. ఎల్ఓసీ మంజూరు కావడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని తక్షణమే స్పందించి సహాయం అందించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం తమ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి విజ్ఞప్తిని పరిశీలిస్తూ వీలైనంత త్వరగా సహాయం అందించేందుకు కృషి చేయడం ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు.

## బోడులో విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



**టేకులపల్లి,జూన్ 24,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని బోడు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పోచం స్వరూప అత్త ఉదయం చుక్కమ్మ (55) మొక్కంపాడు గ్రామంలోని లాలు చేనులో పత్తి విత్తనాలు నాటే కూలి పనికి వెళ్లారు.ఈ సందర్భంగా చేనుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను దాటుతుండగా,దానికి అకస్మాత్తుగా విద్యుత్ ప్రవహించడంతో ఆమె తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పోయారు.విషయాన్ని గమనించిన తోటి కూలీలు,స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే ఆమె మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బోడు ఎస్సై పోలిరెడ్డి శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.అనంత రం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.మృతు రాలు చుక్కమ్మకు భర్త మల్లయ్య, ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉదయం సుధీర్ ఉన్నారు.సర్పంచ్ కుటుంబంలో చోటుచేసుకున్న ఈ ఆకస్మిక విషాదంతో బోడు గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## పొగలపల్లిలో విత్తన మేళా ప్రారంభం





**ములకలపల్లి, జూన్ 24 (ప్రజాజ్యోతి ):** నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఏర్పటు విత్తన మేళాను మండలంలోని పొగళ్లపల్లి రైతు వేదికలో బుధవారం పొగళ్లపల్లి సర్పంచ్ మడకం రవి, తిమ్మపేట సర్పంచ్ తుర్రం శ్రీనివాస్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రాహుల్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. పత్తిలో అంతర పంటగా కంది సాగు చేయాలని, రైతువేదికలో యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. పొగలపల్లి సర్పంచ్ మడకం రవి, తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీను మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు ఒకేచోట అందుబాటులో ఉంచడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోరైతులు పాలకుర్తి రత్నంభూషణం, పాలకుర్తి రవి, డానియల్, సిరుమప్ప, రాంబాబు, కొమ్మరాజు శ్రీనివాస్, వర్స నాగరాజు, మల్లేష్, వినోద్, ప్రసాద్ తదితరులు, మరియు ఫెర్టిలైజర్ షాప్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొట్టిన లారీ

- రెండు గంటల పాటు క్యాబిన్ లోనే ఇరుక్కుపోయిన డ్రైవర్





**చర్ల, జూన్ 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం దేవరపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది . భద్రాచలం నుండి చెర్లకు వస్తున్న ఓ లారీ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్నటువంటి చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రతకు లారీ ముందు భాగం నుజ్జునుజ్జై, డ్రైవర్ మహేష్ క్యాబిన్ లోనే చిక్కుకుపోయారు.విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్యాబిన్ పూర్తిగా నలిగిపోవడంతో డ్రైవర్‌ను బయటకు తీసేందుకు రెండు గంటల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో జెసిబినీ, ట్రాక్టర్లను రంగంలోకి దించి డ్రైవర్ని సురక్షితంగా బయటకు తీశారు. సహాయక చర్యల అనంతరం క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మహేష్‌ను అతి కష్టం మీద 108 అంబులెన్స్‌లో చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ సాయి వర్ధన్ వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి తరలించారు

- ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలకు తూట్లు...
- లోన్ల పేరుతో అక్రమ వసూళ్లు..
- పార్టిషన్ డీడ్‌లతో రుణాలు...
- అధిక వడ్డీలతో రుణగ్రహీతల ఆవేదన...




# పాల్వంచలో ... లోన్ మాఫియా

**ఏజెన్సీ గ్రామ పంచాయతీ ప్రాంతాల్లో కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, మధ్యవర్తులు (దళారులు) మరియు రికవరీ ఏజెంట్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. "లోన్ ఇప్పిస్తాం" అనే పేరుతో అమాయక ప్రజల నుంచి భారీ మొత్తాల్లో అక్రమ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

● పాల్వంచ, ప్రజాజ్యోతి

స్థానికుల కథనం ప్రకారం, రుణం కావాలంటే ముందుగా ఇంటికి పార్టిషన్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అప్పుడే లోన్ మంజూరు అవుతుందని చెప్పి దళారులు ప్రజలను నమ్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో రిజిస్ట్రేషన్ ఖర్చులు, స్టాంప్ డ్యూటీ, ఇతర చార్జీల పేరుతో ఒక్కో కుటుంబం నుంచి రూ.50వేల నుంచి రూ.1 లక్ష వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### ››› పార్టిషన్ డీడ్ ఖర్చులు ఎంత..? వసూళ్లు ఎంత..?

న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం పార్టిషన్ డీడ్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దిష్టమైన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు మాత్రమే ఉంటాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో అసలు ప్రభుత్వ ఫీజుల కంటే పలుమార్లు అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో దళారులు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కొందరు వ్యక్తులు కుమ్మక్కై పనిచేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› 15 లక్షలు తీసుకుని 35 లక్షలు కట్టాల్సిన పరిస్థితి

రుణగ్రహీతల వేదన ప్రకారం, రూ.15 లక్షల రుణం తీసుకున్నవారు వడ్డీలు, ప్రాసెసింగ్ ఫీజులు, చార్జీల పేరుతో చివరికి రూ.35 లక్షల వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. నెలవారీ వడ్డీ రేట్లు, ఇతర చార్జీలను కలిపి 20 నుంచి 22 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధిక వడ్డీ భారం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయని, రుణం తీర్చలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

### ››› రికవరీ పేరుతో వేధింపులు

రుణ చెల్లింపులు ఆలస్యమైతే ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల రికవరీ ఏజెంట్లు ఇళ్ల వద్దకు వచ్చి ఒత్తిడి తెస్తున్నారని, కొన్ని చోట్ల బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "బాకీ వెంటనే చెల్లించకపోతే ఇల్లు జప్తు చేస్తాం" అంటూ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

### ››› ఏజెన్సీ చట్టాలపై సందేహాలు

ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టం ప్రకారం గిరిజనుల భూములు, ఆస్తుల రక్షణకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామ పంచాయతీ పరిధిలోని కొన్ని ఇళ్లను తాకట్టు పెట్టి రుణాలు మంజూరు చేయడంపై కూడా చట్టపరమైన సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు రెవెన్యూ అధికారులు, బ్యాంకు ఉద్యోగుల అభిప్రాయం ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకులు అనేక సందర్భాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆస్తులపై రుణాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తుంటాయి. అలాంటప్పుడు ప్రైవేట్ ఎన్‌బీఎఫ్‌సీలు ఏ నిబంధనల ఆధారంగా మోర్టగేజ్‌లు స్వీకరిస్తున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ››› అధికారుల సహకారం లేకుండా సాధ్యమేనా..?

ఈ వ్యవహారంలో కొందరు మధ్యవర్తులు, ప్రైవేట్ ఫైనాన్స్ ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల్లోని కొందరు వ్యక్తుల మధ్య కమిషన్ వ్యవస్థ నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల సహకారం లేకుండా ఇలాంటి వ్యవహారాలు పెద్దఎత్తున జరగడం సాధ్యం కాదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### సమగ్ర విచారణకు డిమాండ్

ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టిషన్ డీడ్‌ల ఆధారంగా జరిగిన రిజిస్ట్రేషన్లు, వాటిపై మంజూరైన రుణాలు, వసూలు చేసిన వడ్డీలు, రికవరీ విధానాలపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజాసంఘాలు, బాధితులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, తహసీల్దార్, రిజిస్ట్రేషన్ శాఖ మరియు సంబంధిత ఆర్థిక నియంత్రణ సంస్థలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వాస్తవాలను వెలికితీయాలని, అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లోన్ పేరుతో అమాయక ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి అనే అభిప్రాయం స్థానికంగా బలంగా వ్యక్తమవుతోంది.

# గోల్డ్ తాకట్టు పెడుతున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త?

- బ్యాంక్ అధికారులు ప్రజలను మోసం చేస్తున్నారంటూ ఆరోపణలు
- బంగారం ధరలు పెరిగే సరికి వినూత్న రీతిలో మోసాలు
- పాల్వంచలో ఒక మహిళ మరో మహిళకు వన్ గ్రామ్ గోల్డ్ ఇచ్చి తిరిగి తీసుకునే క్రమంలో ఇది నా అసలు బంగారం కాదంటూ ఉబకాయిస్తున్న కిలాడి లేడీ

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 24, (ప్రజా జ్యోతి)** బంగారం ,వెండి ధరలు రోజురోజుకి పెరిగిపోతుండటంతో కొంత మంది వ్యక్తులు వినూత్న రీతిలో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని వార్తలు దావణాల విస్తరిస్తున్నాయి, పాల్వంచకు చెందిన కొంతమంది వ్యక్తులు స్థానికంగా ఉన్న కొన్ని బ్యాంకులలో వారి అవసరాల కోసం తమ వద్ద ఉన్న బంగారు అభరణాల ను బ్యాంకులలో తాకట్టు పెట్టగా, ,తాకట్టు పెట్టిన వ్యక్తికి బ్యాంక్ అధికారులు మీరు బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు వన్ గ్రామ్ గోల్డ్ వని సదరు వ్యక్తికి నోటీసులు పంపించడంతో సంబంధిత బాధితులు ఒక్కసారిగా షాక్ కు గురై బిత్తర పోతున్న వైనం పాల్వంచలో చోటుచేసుకుంది, ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచ మండలానికి చెందిన అనురాధ అనే మహిళ ఇంటి అవసరాల కోసం తమ వద్ద ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు నగలను రెండు సంవత్సరాల క్రితం పాల్వంచ లోనీ ఒక బ్యాంకులో తాకట్టు పెట్టి సుమారు రెండు లక్షల రూపాయలను రుణంగా తీసుకున్నారు ,అయితే అనురాధ రెండు సంవత్సరాల నుండి తాకట్టు పెట్టిన బంగారానికి బ్యాంకులో వడ్డీ చెల్లిస్తూనే ,ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించుకుంటూ వస్తున్నారు ,ఇది ఇలా ఉండగా పది రోజుల క్రితం అనురాధకు బ్యాంక్ అధికారులు రెండు సంవత్సరాల క్రితం బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు గోల్డ్ వి కావని వన్ గ్రామ్ గోల్డ్ బంగారం అంటూ అనురాధకు బ్యాంక్ అధికారులు నోటీసులు పంపించారు, దీంతో అనురాధతో పాటు ఆమె కుటుంబ సభ్యులు నోటీసులు చూసి విస్మయానికి గురయ్యారు, స్పందించిన అనురాధ వెంటనే పాల్వంచ పోలీసులను ఆశ్రయించింది, ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఇట్టి విషయంపై విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది, బంగారు ఆభరణాలను బ్యాంకులలో తాకట్టు పెట్టుకునే ముందు అందుకు సంబంధించి ప్రత్యేక సిబ్బందితోపాటు ప్రత్యేక కౌంటర్లు కూడా ఉంటాయి, అసలు బ్యాంక్ అధికారులు బంగారు నగలను తాకట్టు పెట్టుకునే ముందు కస్టమర్ తీసుకువెళ్లిన బంగారంను తీసుకొని బ్యాంకు అధికారులు అన్ని విధాలుగా తనిఖీ చేసుకొని, తూకం వేసి అందుకు సంబంధించిన డబ్బులు బాధితులకు అందించి రిసిప్టును అందజేయడం ఆనవాయితీగా వస్తుంది ,కానీ అనురాధ ఇచ్చిన బంగారు ఆభరణాలు సంవత్సరాలు గడిచిన తర్వాత బ్యాంక్ అధికారులు మాత్రం ఇవి బంగారు ఆభరణాలు కావంటూ బాధితులకు నోటీసులు పంపించడం తో బ్యాంకు అధికారులపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు, అనురాధ కుటుంబ సభ్యులు తమకు ఇచ్చిన నోటీసుపై బ్యాంకు ఎదుట ఆందోళన చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం, ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం దమ్మపేట రోడ్లో గల ఒక హోటల్ యజమానురాలిని వైరా నుండి వచ్చి హోటల్ పై ఉన్న ఇంటిని అద్దెకు తీసుకొని ఆమెతో సన్నిహితంగా ఉండటం ప్రారంభించింది, ఈ తరుణంలో హోటల్ యజమానురాలని ఎలాగైనా మోసం చేయాలనే ఉద్దేశంతో ఆ మహిళ తనకు డబ్బు అవసరం ఉందని తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి ఎక్కడైనా నగదును ఇప్పించాలని కోరింది, అంతేకాకుండా తన వద్ద ఉన్న వన్ గ్రామ్ గోల్డ్ కు సంబంధించిన రెండు జతల బుట్టలను హోటల్ యజమానురాలకి అందించి తాను రేపు ఉదయం వస్తానని ఎలాగైనా తనకు నగదును ఇప్పించాలని వెళ్ళింది, మరుసటి రోజు ఆ మహిళ హోటల్ యజమానురాలు దగ్గరికి వచ్చి తన బంగారు వస్తువులు తనకు ఇవ్వాలని వేరే ఒక బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంటానని తెలిపింది, దీంతో హోటల్ యజమానురాలు తనకిచ్చిన నకిలీ బంగారు వస్తువులను తిరిగి ఆమెకు అందజేసింది, వాటిని చూసిన సదరు మహిళ ఆ వస్తువులు తాను ఇచ్చినవి బంగారు వస్తువులని ఘర్షణకు దిగడమే కాకుండా పట్టణ పోలీసులను ఆశ్రయించింది, విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి ఆ మహిళ బంగారాన్ని ఎక్కడ ,ఏ షాప్ లో కొనుగోలు చేసింది, అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు, అంతేకాకుండా మహిళ ఇచ్చిన బంగారానికి సంబంధించిన బిల్లులను తీసుకురావాలని పోలీసులు మహిళను కోరినట్లు సమాచారం, ఇది ఇలా ఉండగా ఈనెల 24న కె ఎస్ పి రోడ్ లో గల ఒక ప్రైవేట్ బ్యాంకులో ఓ కస్టమర్ తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను విడిపించుకునేందుకు వెళ్లగా సదరు బ్యాంక్ అధికారులు కస్టమర్ ను కొంత ఇబ్బంది పెట్టడంతో విషయం తెలుసుకున్న పాత్రికేయులు బ్యాంకుకు వెళ్లి బ్యాంక్ అధికారులతో మాట్లాడడంతో అతనికి కొంత న్యాయం చేకూరినట్లు తెలిసింది, ఏదేమైనాప్పటికీ బంగారం ధర రోజు రోజుకు పెరిగిపోవడంతో కొంతమంది వ్యక్తులు వ్యూహాత్మకంగా అనేక వినూత్న రీతిలో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది , ప్రజలు తమ అవసరాల నిమిత్తం ప్రైవేట్ బ్యాంకులలో తాకట్టు పెట్టిన బంగారు వస్తువుల పట్ల అన్ని విధాలుగా జాగ్రత్తగా అన్ని ఆధారాలతో ఉండాలని పలువురు కోరుతున్నారు, అదేవిధంగా ప్రస్తుత రోజులలో వన్ గ్రామ్ గోల్డ్ మార్కెట్లోకి రావడంతో అసలు బంగారం ఏది ? నకలు బంగారం ఏది అనే విషయం తెలుసుకోలేనంతగా ఉండడంతో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకుని వడ్డీ వ్యాపారాలు చేసే వారి సైతం అలెర్ట్ గా ఉండకపోతే మోసగాళ్ల ఉచ్చులో పడి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుందనీ పలువురు హెచ్చరిస్తున్నారు, ఇప్పటికైనా ప్రజలు బ్యాంకులలో తాకట్టు పెట్టిన బంగార విషయంపై అజాగ్రత్తను విడ నాడి జాగ్రత్తగా ఉండాలని పలువురు కోరుతున్నారు